# మళ్ళీ ప్రయాణం తప్పదు

— అలపర్తి రామకృష్ణ

జీవితంలో సాయంకాలం తొంగిచూసే వేళ-

ఎక్కడో జీవితసత్యాన్ని మర్చిపోయినట్లనిపించింది...

చుట్టూ చీకటి-

అసంతృప్తి...ఆందోళన...

ఎన్ని కలలు కన్నాడు తను-

కొడుకు ఐ.ఎ.యస్. ఆఫీసర్ కావాలనుకున్నాడు- వాడేమో డిగ్రీ కూడా పూర్తిచెయ్యకుండా తాగుబోతయ్యాడు. నలుగురు చీదరించుకుంటూ వున్నా కంటిముందు వున్నాడులే అన్న తృప్తి-

ఆ తృప్తి కూడ ఉండనివ్వాడా భగవంతుడు?

గొప్ప ఇంద్రజాలికుడు-

మొహానికి రాసుకున్న రంగు అర్ధాంతరంగా తుడిచేసుకుని జీవన నాటకరంగం నుండి నిష్క్రమించాడు కారు ఏక్సిడెంట్‌లో-

ఆ కొడుకు కోసం ఎన్ని అవస్థలు-

ఎన్నో గుళ్ళు చుట్టూ...ఎందరికో నమస్కారాలు-

వరుసగా ఆరుగురు ఆడపిల్లలు... ఓపిగ్గా ఎదురుచూడగా చివరికి ఫలితం దక్కింది-

పున్నామనరకం నుంచి తప్పిస్తాడనుకుంటే వాడి అంత్యక్రియలు తన చేతుల్తో చేయక తప్పలేదు-

దేవుడిని మించిన ఇంద్రజాలికుడు ఎవరున్నారు?

చుట్టాలబ్బాయికి చదువు చెప్పించాడు- తనని సొంత తండ్రిలా అభిమానిస్తాడతను. తనకే కష్టంవొచ్చినా విలవిల్లాడిపోతాడు-

ఆ కుర్రాడంటే తన కెందుకు అభిమానం ఏర్పడలేదు?

చనిపోయిన తాగుబోతు కొడుకంటేనే తనకి అపేక్ష ఎందుకని?

ఎంత విచిత్రం జీవితం...

అన్నీ అపశ్రుతులే...

జీవితానికి అర్థం ఏమిటి?

లోకం చూశాను-

లోకం చూశాను-

కంటిముందు వస్త్రాల రాసులుంటే, కళ్ళు మూసుకుని వాటికి దూరంగా పడిచేరు.

పోయిన వస్త్రాలకోసం మళ్ళీ వెతుకు తాను...

చిన్నప్పుడు-

పక్కన తల్లిదండ్రులను చూసి ఎంతో గర్వపడ్డాడు తను.

'కొండంత అండ వుంది' అనుకు న్నాడు.

మరో పదేళ్ళు గడిచేసరికి బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులిద్దరూ మర ణించేరు. వాళ్ళిద్దరి మధ్య కూర్చున్న తను చిన్న దెబ్బకూడ తగలకుండా బ్రతికేడు.

మళ్ళీ ఒంటరితనం...

పెళ్ళయ్యింది- తోడు దొరికింది.

బ్రతుకే ఊగే ముళ్ళాల ఉయ్యాలను కున్నాడు.

ఆ ఉయ్యాల తాడు 'టప్పున' తెగి పోయింది.

పదేళ్ళు భార్య పాత్ర నిర్వహించి ఏడుగురు పిల్లల్ని కనేసి తన దోవన తాను వెళ్ళిపోయింది.

మొక్కపై ఆకులన్నీ రాలిపోయాయి-

తాతయ్య, అమ్మమ్మ, అక్కయ్య, బావయ్య వొక్కొక్కరు చెప్పకుండానే వెళ్ళిపోయారు.

కొత్త పాత్రలొచ్చాయి. రంగస్థలం మీదకు.

అల్లుడు- మనవళ్ళు, మనవరాళ్ళు అందరూ దూరంగా జరిగిపోతున్నారు.

తన మనసున మనసై మసలుకునే వాళ్ళే లేరు.

తను అక్కర్లేదు! తన డబ్బు కావాలి!

ఆ డబ్బుకోసం ఎంత కక్కుర్తి పడ్డాడు?

రాత్రింబవళ్ళు హాస్పిటల్‌కు అతుక్కు పోయి లక్షలు, లక్షలు గడించేడు. రోగుల్ని పీడించి డబ్బులు వసూలు చేశాడు. ఆఖరుకు 'ఫిజీషియన్ శాంపిల్స్' కూడ అమ్ముకున్నాడు.

ఎవరికోసం?

పిల్లలకోసం...

వాళ్ళందరూ ఆ డబ్బునే ప్రేమించారు.

డబ్బుతో తనేమన్నా సుఖపడ్డాడా?

వొంటినిండా రోగాలే!

తీపి వస్తువులు తినకూడదు. నెయ్యి వేసుకోకూడదు. ఉప్పు, కారంలేని చప్పటి కూరలు తినాలి.

వొంట్లో కండరాలు పట్టుతప్పాయి.

జుట్టు వూడిపోయి బట్టతల వొచ్చే సింది. తలకి వాసనమూనె రాసుకుందా మన్న రోజుల్లో చేతిలో డబ్బు వుండేది కాదు. ఇప్పుడు డబ్బు వుంటే నెత్తిమీద జుట్టులేదు.

చాలాదూరం ప్రయాణం చేశాడుతను.

Presented by
Ghandikota Brahmaji Rao and
Srimathi Sitarama




దిగవలసిన స్టేషనుకూడ దగ్గరకొచ్చేస్తుంది తనతోపాటే రైలెక్కిన ప్రయాణికులు చాలమంది మధ్యలోనే దిగి వెళ్ళిపోయారు.

ఇంత దూరం ప్రయాణం చేశాక తనెందుకు ప్రయాణించేశాడో అర్థం కావడంలేదు.

ఎక్కడో జీవిత రహస్యాన్ని మర్చిపోయారు...

గేటు తీసిన చప్పుడు విన్పించేసరికి ఆలోచనల దొంతరనుండి బయటపడ్డాడు అమరయ్య.

గేటుతీసి యింట్లోకి రాకుండా యింటి ముందున్న పూలమొక్కల మధ్య కూర్చుండిపోయింది అర్పిత.

అర్పితకు అలకొస్తుంటాయి. ఎదురింటి వాళ్ళమ్మాయి.

ఆ చిన్నపిల్ల దృష్టిని అంతగా ఆకర్షించింది ఏమిటావనుకుంటూ దగ్గర కెళ్ళాడు అమరయ్య.

...మందారపువ్వు....

మంచులో తడిసిన మందారపువ్వు

మలివెచ్చని సూర్యకిరణాలు స్పృశించే తరికి పరవశించిపోతూ వుంది.

ఎంత మనోహరంగా వుందా దృశ్యం.

అర్పిత మోహంలో కూడా అదే భావన.

జీవితం తొలిదశలోనే ఆ పిల్ల అందమైన అనుభూతి పొందగల్గుతుంది.

జీవితం మలిదశలో తను...

చీడ పట్టిందని మందారచెట్టు కొట్టేసాడు.

చెట్టు మొదలు మళ్ళీ చిగురించింది.

చిన్న. చిన్న కొమ్మలొచ్చాయి-

చిరుగాలికి వయ్యారంగా కదులుతూ ఓ మందారపువ్వు-

ఆ పువ్వును చూసి పాప పులకరింత-

చీడపట్టిన మందారచెట్టుకు మళ్ళీ జీవం-

మృత్యోర్మా అమృతంగమయ...

ఏదో జీవితసత్యం స్ఫురించింది అమరయ్యకు ఆ క్షణంలో-

హుషారుగా లేచి నిలబడ్డాడు-

నరాల్లో కొత్త రక్తం ఎక్కించినట్లుగా-

డయాలసిస్ చేసినట్లుగా వుంది దేహం-

మళ్ళీ ప్రయాణం...

దిక్కు-మొక్కు-లేని చిన్నారులకు వైద్యసహాయం అందిస్తే

జీవితానికి ఓ సార్థకత-

జీవితానికి అర్థం అదే-

అమరయ్య మనస్సు తేలికపడింది.

• •


